క్లుప్తంగా

మన్యంలో భారీ వర్షం



జీకే వీధిలో వంతెనపై నుంచి ప్రవహిస్తున్న వర్షపు నీరు

గూడెంకొత్తవీధి/రాజవొమ్మంగి: జిల్లాలోని చాలా ప్రాంతాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. గెడ్డలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జనజీవనం స్తంభించింది. పొగాకు తదితర వాణిజ్య పంటలకు వర్షాలు మేలు అని రైతులు చెప్పారు.

సీతగుంటలో జంగిల్ క్లియరెన్స్



పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ మాధవరావు

పెదబయలు: మండలంలోని సీతగుంట పంచాయతీ సీతగుంట పాత వీధి, సీతగుంట కాలనీల్లో శనివారం జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టినట్టు సర్పంచ్ పలాసి మాధవరావు, పంచాయతీ కార్యదర్శి కాశీబాబు చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీలోని అన్ని గ్రామాల్లో రోడ్డు కిరువైపులా ఉన్న తుప్పల తొలగింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లో చేస్తామన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, వర్షం నీరు నిల్వ లేకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వైస్ సర్పంచ్ గంగాధరం వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం



ఊరేగింపులో చిన్నారులు

చింతపల్లి: చింతపల్లిలో శనివారం గణేశ నిమజ్జనాలు సందడిగా జరిగాయి. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో గ్రామస్తులు ఊరేగింపులో పాల్గొన్నారు. శక్తి వేషధారణలు ఆకట్టుకున్నాయి. అన్నసమారాధనలు చేశారు.

క్రీడా పోటీలు ప్రారంభం



డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కూనవరం: మండలంలోని మర్రిగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం మండల స్థాయి క్రీడా పోటీలను హెచ్ఎం సోడె వెంకట్రావు, పాఠశాల చైర్మన్ విజయలు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు క్రీడలు దోహదపడతాయన్నారు. అథ్లెటిక్స్, ఖోఖో, షెటిల్, కబడ్డీ తదితర పోటీలు జరిగాయి. ఆయా పోటీల్లో విజేతలు ఈనెల 23, 24తేదీల్లో రంపచోడవరంలో జరగనున్న డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.
పీఈటీ, పీడీలు వెంకటేష్, వరలక్ష్మి, ప్రసాద్, రాధాకృష్ణ, చంద్రశేఖర్, విజయ, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపాలెంలో ప్రజావేదిక



జగ్గంపాలెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషదేవి

గంగవరం: మండలంలోని జగ్గంపాలెం, జి.ఎం.పాలెంలలో శనివారం జరిగిన ప్రజావేదిక కార్యక్రమాల్లో రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషాదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీమంతం కార్యక్రమంలో పాల్గొన్నారు. తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో శ్రీనివాసులు, సీడీపీవో లక్ష్మి, నాయకులు అర్జున, సిద్దూ, వెంకటేశ్వర్లు, సర్పంచ్ అక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పరిశుభ్రత విద్యార్థుల బాధ్యత



ముంచంగిపుట్టులో పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



అరకులోయ పాఠశాలలో పరిసరాలు పరిశుభ్రం చేస్తున్న విద్యార్థులు, సిబ్బంది.



పెదబయలు ఆశ్రమ బాలూర పాఠశాల-1లో పరిశుభ్రత పనులు చేస్తున్న ఏటిడబ్ల్యువో స్వర్ణలత



పాఠశాలలో శ్రమదానం కార్యక్రమం నిర్వహిస్తున్న ఏటీడబ్ల్యువో మల్లికార్జునరావు

ముంచంగిపుట్టు: పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశాల మేరకు శ్రమదానంతో బడి పరిశుభ్రత కార్యక్రమాన్ని మండలంలోని 11 ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు, బాలికల పాఠశాలల్లో శనివారం నిర్వహించారు. పాఠశాలల్లో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాలల ఆవరణలోని చెత్తను తొలగించి,డ్రైనేజీలను శుభ్రపరిచారు. పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఏటీడబ్ల్యూవో స్వర్ణలత మాట్లాడుతూ పాఠశాలల్లో బాధ్యతగా పరిశుభ్రతను పాటించాలన్నారు. విద్యార్థులు వ్యక్తగత శుభ్రత పాటించాలన్నారు. హెచ్ఎంలు లక్ష్మీ,ప్రకాశం, మాణిక్యాలరావు, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

అరకులోయరూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలో శనివారం ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు మాట్లాడుతూ ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశాల మేరకు సంక్షేమ పాఠశాలల్లో శ్రమదానంతో బడి పరిశుభ్రత కార్యక్రమాన్ని ప్రతినెల మూడవ శనివారం నిర్వహిస్తామన్నారు. పాఠశాలల పరిశుభ్రతను విద్యార్థులు బాధ్యతగా తీసుకోవాలన్నారు.

పెదబయలు: పాడేరు ఐటిడిఏ పీవో ఆదేశాల మేరకు మండలంలో అన్ని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో శ్రమదానంతో బడి పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించడం జరిగిందని స్థానిక మండల ఏటిడబ్ల్యువో కె. స్వర్ణలత అన్నారు.శనివారం పెదబయలు మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల-1. గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల-2లో శనివారం నిర్వహించిన శ్రమదానంతో బడి పరిశుభ్రత కార్యక్రమంలో ఏటీడబ్ల్యూవో కె.స్వర్ణలత మాట్లాడుతూ పాఠశాల, వసతి గృహ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతీ పాఠశాలలో హెచ్ఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులు కలిసి పాఠశాలల్లో మంచి వాతావరణం కల్పించాలన్నారు.డిప్యూటీ వార్డెన్ చక్రధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: స్థానిక గిరిజన సంక్షేమ పాఠశాలలో ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు ఆధ్వర్యంలో శ్రమదానంతో బడి పరిశుభ్రత కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఆశ్రమ పాఠశాలల్లో పరిసరాలను శుభ్రం చేయించే బాధ్యత యాజమాన్యం చూసుకోవాలని కోరారు. కార్యక్రమాల నిర్వహణలో అందరు బాధ్యతతో పాల్గొవాలని కోరారు.

చట్రాపల్లి బాధితులకు సాయం



కేజీహెచ్‌లో క్షతగాత్రులకు ఆర్థిక సాయం అందిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

గూడెంకొత్తవీధి: చట్రాపల్లిలో ఇటీవల వరదలకు కొండచరియలు విరిగిపడి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను శనివారం గూడెంకొత్తవీధి మండల పీఆర్‌టీయూ నాయకులు పరామర్శించారు. బాధితులకు రూ.27,700 ఆర్థిక సాయంగా అందించారు. జీవీఎంసీ ఉన్నత పాఠశాల కప్పరాడ నుంచి రూ.7,700 సాయంగా ఇచ్చారు. వైద్యాధికారులు డాక్టర్ హేమ దుర్గారావు, మోహన్ కృష్ణతేజలను పీఆర్‌టీయూ నాయకులు కలిసి క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలందించాలని కోరారు. వీరితో పాటు కొయ్యూరు మండలం వై.ఎస్.పాకలు, జీకేవీధి మండలం ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులను పరామర్శించి కొంత ఆర్థికసాయం అందించారు. అల్లూరి జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడు యూ.వి.గిరి, ఆంధ్ర మెడికల్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పసుపులేటి లక్ష్మణరావు, పీఆర్‌టీయూ స్టేట్ కౌన్సిలర్ దామోదరరావు, జీకేవీధి మండల గౌరవ అధ్యక్షుడు గబులంగి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి కిలో వసంతకుమార్, జిల్లా పీఆర్‌టీయూ మీడియా ఇన్‌చార్జి శరభ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పడాల వీరభద్రరావుకు నివాళి



గంగవరంలో పడాల వీరభద్రరావుకు నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణ, హెచ్ఎం సత్యనారా

గంగవరం : అల్లూరి సీతారామరాజు చరిత్ర పరిశోధకులు అల్లూరి యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు, కోస్తా సమయం పత్రికా సంపాదకులు పడాల వీరభద్రరావు మృతికి "పలువురు సంతాపం వ్యక్తం చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో అల్లూరి విగ్రహం వద్ద మండల అల్లూరి యువజన సంఘం, స్థానిక ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో పడాల వీరభద్రరావు సంతాప కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజెన్సీలో అల్లూరి జీవిత చరిత్ర, అల్లూరి స్మారక చిహ్నాల పరిరక్షణలో పడాల వీరభద్రరావు అందించి సేవలు మరువలేనివని స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ కొంకోట కృష్ణ, ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం ఆర్.వి.సత్యనారాయణ అన్నారు. కార్యక్రమంలో ముందగా అల్లూరి విగ్రహానికి, పడాల వీరభద్రరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్లూరి చరిత్ర ఏజెన్సీలోనే కాకుండా జాతీయ స్థాయిలో ప్రతి ఒక్కరికి తెలిసేలా వీరభద్రరావు ఎన్నో కార్యక్రమాలను నిర్వహించారని, ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాపారావు, శివాజీ, గంగవరం యువసేన యువకులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు వేగవంతం చేయాలి



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ ఈశ్వరి, సర్పంచ్ సోయితా

డుంబ్రిగుడ: మండలంలోని సొవ్వ పంచాయతీ పరిధిలో రూ.1.20 కోట్లతో చేపట్టనున్న రోడ్డు పనులకు ఎంపీపీ బాకా ఈశ్వరి శనివారం శంకుస్థాపన చేశారు. అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఎంపీ డాక్టర్ గుమ్మ తనూజరాణి ఆదేశాల మేరకు సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ 2022-23 మంజూరు చేసిన నిధులతో కొన్ని గ్రామాల్లో సీసీ రోడ్డు పనులు జరగ్గా, కొన్నిచోట్ల ఎన్నికల కారణంగా పనులు తాత్కాలికంగా నిలిపివేసిందన్నారు. కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న రహదారులతో పాటు కొత్త వాటిని వేగవంతంగా నిర్మించాలని కోరారు. సొవ్వ పంచాయతీ పరిధిలోని 10గ్రామల అభివృద్ధి కోసం భారీ మొత్తంలో నిధులు సమకూర్చిన ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఎంపీ తనూజరాణికి, మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ పి.సోయితా, సాగర ఎంపీటీసీ సభ్యుడు వి.దేవదాసు, అరకు సోషల్ మీడియా కన్వీనర్ నరసింగరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు సింహాచలం, అశోక్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం



ఎంపీపీ రమేష్

కొయ్యూరు: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కటి కూడా అమలు చేయలేదని ఎంపీపీ బడుగు రమేష్ చెప్పారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ సూపర్ సిక్స్ అంటూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలకు మోసం ఫిక్స్ చేసిందన్నారు. ఎటువంటి పథకాలు అమలుచేయలేక.. ప్రజలకు సమాధానం చెప్పలేక చంద్రబాబు తిరుపతి లడ్డుపై రగడ లేపారన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మభ్య పెట్టాలని చంద్రబాబు ప్రభుత్వం చూస్తుందన్నారు.
ఇది దగా ప్రభుత్వమని స్పష్టం చేశారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి నుంచి లక్ష ఉద్యోగాల కల్పన లాంటి హామీలు గాలిలో కలిసిపోయాయన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉండాల్సిన మెడికల్ కళాశాలలను ప్రైవేటుకు కట్టబెట్టాలని చూడడం దారుణమన్నారు. పేదవాడు డాక్టర్ కాకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం ఉందన్నారు. తల్లికి వందనం అటకెక్కిందన్నారు. రైతు భరోసా కూడా ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు వంటి హామీలు గుప్పించి వాటిని విస్మరించి చంద్రబాబు పాలన సాగిస్తున్నారన్నారు.
ప్రజలను నిలువునా మోసం చేసిన కూటమి నేతలను ప్రజలు ప్రతీచోట నిలదీయాలని పిలుపునిచ్చారు. ఇది ముమ్మాటికి ప్రజలను ముంచే ప్రభుత్వం అని స్పష్టం చేశారు.

ఓపెన్ స్కూల్ విధానంపై అవగాహన



రాజవొమ్మంగిలో అవగాహన ర్యాలీ

రాజవొమ్మంగి: ఓపెన్ స్కూల్ విధానంగా స్థానిక విద్యావనరుల కేంద్రం వద్ద ఎంఈవో-2 సత్యనారాయణదొర ఆధ్వర్యంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బందికి శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనివార్య కారణాల వల్ల చదువు మధ్యలోనే ఆపేసిన విద్యార్థులకు ఓపెన్ స్కూల్ ఓ వరం లాంటిదన్నారు. ఓపెన్ స్కూల్ విధానంలో రెండేళ్ల ఇంటర్ కోర్సును ఒక ఏడాదిలోనే పరీక్షలు రాసి పూర్తి చేయవచ్చని వెల్లడించారు. మండలంలోని నాలుగు చోట్ల ఓపెన్ స్కూల్ అడ్మిషన్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఏహెచ్ఎస్, జెడ్పీహెచ్ఎస్ రాజవొమ్మంగి, లాగరాయి, బోర్నగూడెం పాఠశాలల్లో ఫీజు చెల్లించి ఓపెన్ స్కూల్లో చేవరవచ్చని వివరించారు. ఎంఈవో-2 సూరయ్య రెడ్డి పాల్గొన్నారు.

అధ్వాన దారులు... వైద్య సేవలకు అవస్థలు

- అధ్వాన రహదారితో గ్రామానికి చేరని 108
- ద్విచక్ర వాహనంపై రోగికి ఆస్పత్రికి తరలింపు



గ్రామానికి 108 వచ్చే అవకాశం లేక రోగిని వాహనంపై తీసుకెళ్తున్న కుటుంబసభ్యులు

పెదబయలు: అధ్వాన దారితో గ్రామానికి 108 వచ్చే పరిస్థితి లేదని, కొంత దూరం రోగిని తీసుకొస్తే అక్కడ అంబులెన్స్ ఏర్పాటుచేస్తామని సిబ్బంది పేర్కొన్నారు. మండలంలోకి గుల్లేలు పంచాయతీ కించూరు గ్రామంలో ఈ సంఘటన జరిగింది.కించూరు గ్రామానికి చెందిన బూడిదె బుల్లమ్మ(42) వాంతులు, విరేచనాలతో శుక్రవారం రాత్రి నుంచి బాధపడుతోంది.
నీరసించి నడవలేని పరిస్థితిలో ఉన్న బుల్లమ్మను శనివారం ఉదయం 11 గంటలకు 108 వాహనం గ్రామానికి పంపాలని కాల్ చేయడంతో కించూరు గ్రామం వరకు 108 వాహనం రోడ్డు బాగాలేదు రాదని రాయిమామిడి జంక్షన్ వరకు తీసుకురమ్మని సిబ్బంది చెప్పడంతో కించూరు నుంచి 8 కిలోమీటర్లు దూరం వరకు కుటుంబ సభ్యులు బైక్‌పై మధ్యలో కూర్చొబెట్టి తీసుకొచ్చారు.అక్కడ నుంచి గోమంగి పీహెచ్‌సీకి తరలించి అక్కడ నుంచి ముంచంగిపుట్టు ఏరియా ఆస్పత్రి తరలించారు.ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని వైద్య సిబ్బంది తెలిపారు. గుల్లేలు గ్రామ సమీపంలో కాజ్‌వై పక్కకు ఉన్న మట్టి కోతకు గురైయింది.అలాగే సీమకొండ ఘాటీలో తారురోడ్డు పెద్ద పెద్ద గోతులు ఏర్పడిందని అత్యవసర పరిస్థితి అయితే 108, పీహెచ్‌సీ అంబులెన్స్‌లు రాలేని పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

నేడు సబ్ రిజిస్ట్రార్లకు బదిలీల కౌన్సెలింగ్

- 64 మందిలో 48 మంది బదిలీలకు అవకాశం
- సీనియర్ అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్ల బదిలీలు నేటితో పూర్తి
- మంచి స్థానాల కోసం భారీ పైరవీలు

విశాఖ సిటీ: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీలకు 22న కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఉత్తరాంధ్ర (ఉమ్మడి విశాఖ, ఉమ్మడి విజయనగరం, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాల పరిధి) జోన్‌లో మొత్తం 64 సబ్ రిజిస్ట్రార్లు ఉండగా.. తాజా మార్గదర్శకాలకు అనుగుణంగా ఇందులో 48 మంది సబ్ రిజిస్ట్రార్లు బదిలీ కానున్నారు. మార్చి నెలలో పదవీ విరమణ చేయనున్న ఆనందపురం, పాలకొండ సబ్ రిజిస్ట్రార్లకు బదిలీల జాబితా నుంచి మినహాయించారు. మధురవాడ, భీమిలి, సూపర్ బజార్ ఆర్‌వో, ద్వారకానగర్, అనకాపల్లి, విజయనగరం, విజయనగరం వెస్ట్, శ్రీకాకుళం టౌన్‌తో పాటు కాశీబుగ్గ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వచ్చేందుకు పలువురు సబ్‌రిజిస్ట్రార్లు పైరవీలు చేసుకుంటున్నారు. తాజా మార్గదర్శకాలతో భోగాపురం సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం కాస్తా కేటగిరీ-సీలో మారడంతో ఈ స్థానానికి వచ్చేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. కౌన్సెలింగ్ ద్వారానే జరుగుతుందని అధికారులు పేర్కొంటున్నా.. అధికార పార్టీ నేతల ద్వారా పైరవీలతో పాటు భారీ ఎత్తున ముడుపులు సమర్పించుకునే వారికి మంచి పోస్టింగులు దక్కే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.
విశాఖ డీఐజీ బాలకృష్ణ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఈ కౌన్సెలింగ్ టీమ్‌లో విజయనగరం డీఐజీ సభ్యులుగా ఉన్నారు. జాయింట్ ఐజీ సరోజ పరిశీలకులుగా వచ్చారు. సీనియర్ అసిస్టెంట్స్, ఆఫీస్ సబార్డినేట్స్ బదిలీలను ఆదివారం చేయనున్నట్టు అధికారులు తెలిపారు.

'గిరిజన విద్యార్థుల మరణాలపై సమగ్ర విచారణ చేయాలి'



ఎంపీపీ శెట్టి నీలవేణి

అనంతగిరి(అరకులోయ రూరల్): గిరిజన విద్యార్థుల మరణాలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని ఎంపీపీ నీలవేణి చెప్పారు. ఆమె శనివారం విలేకరులతో మండలంలోని వసతి గృహాల్లో విద్యార్థుల వరుస మరణాలతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారన్నారు.
ఇప్పటికే అనారోగ్యంతో టోకురు గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహానికి చెందిన 7వ తరగతి విద్యార్థి సూకూరు అప్పలకోండ, పినకోట ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న సిరగం లాస్యలు మృతి చెందారన్నారు. ఈ రెండు సంఘటనలు విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి వేసిందన్నారు. గిరిజన విద్యార్థుల మరణాలంటే కూటమి ప్రభుత్వానికి చులకన భావం ఎందుకని ధ్వజమెత్తారు. వైద్యాధికారుల సమ్మెబాట వల్ల ఆస్పత్రుల్లో పూర్తిస్థాయి వైద్యం అందని పరిస్థితి నెలకొందన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల వసతి గృహాల్లో పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందన్నారు. ఇద్దరు గిరిజన విద్యార్థులు మరణిస్తే సంబంధిత అధికారులకు కనీసం చలనం లేదని ధ్వజమెత్తారు. విద్యార్థుల మరణాలపై ఉన్నత స్థాయి కమిటీతో విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఉపాధ్యాయులు సమాజ మార్గదర్శకులు



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న వన్నాడ గ్రామస్తులు తదితరులు

పెదబయలు: ఉపాధ్యాయులు సమాజ మార్గదర్శకులని, భావితరాలను తీర్చిదిద్దే బాధ్యత వారిపై ఉంటుందని ఏటీడబ్ల్యూవో కె.స్వర్ణలత అన్నారు. మండలంలోని గోమంగి పంచాయతీ వన్నాడ గ్రామంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఇటీవల జరిగి ఉపాధ్యాయ దినోత్సం నాడు ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న పలాసి నవీన్‌కుమార్, కొర్రా కృష్ణారావులను సహచర ఉపాధ్యాయులు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ పాంగి జెట్లో మాట్లాడుతూ మండలానికి చెందిన ఇద్దరు ఉపాధ్యాయులకు అవార్డులు రావడం ఆనందంగా ఉందని, విద్యాభివృద్ధికి వారు మరింత కృషి చేయాలని కోరారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న రిటైర్డ్ అధ్యాపకుడు డాక్టర్ రామ్మోహనరావు

చింతపల్లి: స్థానిక గురుకుల జూనియర్ కళాశాల, జెడ్పీహెచ్ఎస్‌లలో క్యాన్సర్‌పై విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ కె.రామ్మోహనరావు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఆధునిక ఆహారపు అలవాట్ల వల్ల క్యాన్సర్ తదితర ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. పొగాకు వినియోగం వల్ల నోటి, గొంతు కేన్సర్‌లు, మహిళల్లో రొమ్ము, గర్భాశయ కాన్సర్‌లు వంటివి పెరిగిపోతున్నాయన్నారు. అనంతరం తెలుగు భాష ప్రాముఖ్యతపై రిటైర్డ్ ఎంఈవో, తెలుగు భాషా పరిరక్షణ సమితి సభ్యుడు తమ్మిరాజు వివరించారు. జిల్లా కన్వీనర్ ప్రిన్సిపాల్ పారయ్య, కళాశాల ప్రిన్సిపాల్ రామేశ్వరం, మాధవి, అప్పలరాజు పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీ



చింతూరులో రైతులకు విత్తనాలు అందజేస్తున్న ఎంపీపీ సవలం అమల తదితరులు



చవిటిదిబ్బలులో విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

చింతూరు: మండల కేంద్రంలో రైతులకు సబ్సిడీపై అపరాల విత్తనాలను ఎంపీపీ సవలం అమల శనివా రం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని ఆమె సూచించారు. ఏవో శ్రీనివాసరావు మాట్లాడుతూ మి నుము, పెసన విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. శరత్, ముత్తయ్య, నవీన్ పాల్గొన్నారు.

వై.రామవరం: మండలంలోని చవిటిదిబ్బలులో ఏఓ ఊషారాణి ఆధ్వర్యంలో రైతులకు మినుముల విత్తనాలను ఎంపీడీవో కె.బాపన్నదొర, సర్పంచ్ బచ్చలి చిన్నమ్మలు శనివారంపంపిణీ చేశారు. మండలంలోని 132 క్వింటాళ్ల మినుముల విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు.

పోషకాహారం అవసరం



గన్నేరుపుట్టులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు



అడ్డతీగలలో సామూహిక సీమంతం

జి.మాడుగుల: మండలంలోని కె.కోడాపల్లి పంచాయతీ బందవీధి సెక్టార్ గన్నేరుపుట్టులోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.సత్యవతి పోషకాహారం ఆవశ్యకతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. సామూహిక సీమంతం కార్యక్రమం నిర్వహించారు. సూపర్వైజర్లు విజయలక్ష్మి, పద్మావతి, లక్ష్మి, మణికుమారి తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీసీ సీడీపీవో వై.సుధ ఆధ్వర్యంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.వి.రంగారావు తదితరులు ఆరోగ్యభద్రతను వివరించారు.సామూహిక సీమంతం కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్లు సుందరి, పావని, వీరాయ్యమ్మ, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

గురజాడ ఆశయ సాధనకు కృషి



అరకులోయలో గురుజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిబ్బంది తదితరులు



మర్రిపాలెంలోని గురజాడ జయంతి వేడుకలో అధ్యాపకులు, విద్యార్థులు



చింతూరు డిగ్రీ కళాశాలలో గురజాడకు నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



ఎ.యర్రగొండలోని కళాశాలలో గురజాడకు నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

అరకులోయ రూరల్/కొయ్యూరు/చింతూరు/ వై.రామవరం: జిల్లా వ్యాప్తంగా సాహితీవేత్త గురజాడ అప్పారావు జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాలలు, కళాశాలల్లో జరిగిన వేడుకలో ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, ప్రముఖులు మాట్లాడుతూ గురజాడ అప్పారావు సాహితీవేత్తగానే కాకుండా గొప్ప సంఘసంస్కర్తగా నిలిచారన్నారు. ఆయన ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అరకులోయలో జరిగిన వేడుకలో ఐద్వా మహిళ సంఘం అధ్యక్షురాలు ప్రభావతి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చలపతిరావు, జయ, అధ్యాపకులు పాల్గొన్నారు. మర్రిపాలెంలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.కృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు. చింతూరులో జరిగిన వేడుకలోప్రిన్సిపాల్ రత్నమాణిక్యం, వైస్ ప్రిన్సిపాల్ ముల్లిశేఖర్ అధ్యాపకులు పాల్గొన్నారు. పి.యర్రగొండలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.